అండర్-14 క్రికెట్ జట్టుకు క్రీడాకారులు ఎంపిక

దినేష్

ధనుష్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురంలోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో వాల్మీకిపురం క్రికెట్ సబ్ సెంటర్‌లో జరుగుతున్న క్రికెట్ క్యాంపు నుంచి ఇద్దరు క్రీడాకారులు దినేష్ (ఆఫ్ స్పిన్), ధనుష్ (ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్) స్కూల్‌గేమ్స్ ఆఫ్ చిత్తూరు ఎస్‌జిఎఫ్ అండర్-14 బాలుర క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు కోచ్ సునీల్ కుమార్ తెలిపారు. వీరు కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరిగే ఎస్‌జిఎఫ్ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరి ఎంపిక పట్ల వీసీసీ అధ్యక్షులు శ్రీధర్, సీనియర్ క్రీడాకారులు షాహెద్, భరత్ తదితరులు క్రీడాకారులను అభినందించారు.

నేడు భారీగా నామినేషన్లు

కడపలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నామినేషన్లు
అనంతపురంలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్ల దాఖలు కసరత్తు ఊపందుకుంది. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీల తరుపున ప్రాతి నిధ్యం వహిస్తున్న పలువురు ఎమ్మెల్సీ అభ్యర్థులు బుధవారం కడప, అనంతపురం కలెక్టరేట్లలో నామినేషన్ దాఖలు చేయడానికి భారీ అనుచరగణంతో కలిసి బయల్దేరనున్నారు. కడప కలెక్టరేట్‌లో వైసిపి తరుపున స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి పి.రామసుబ్బారెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లో వైసిపి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది. భారీ అనుచరగణంతో అనంతపురం కలెక్టరేట్‌కు బయల్దేరి వెళ్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది. వైసిపి, టిడిపి, ఇతర స్వతంత్ర్య అభ్యర్థులు పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేయనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల కమిషన్ ఈ నెల 13 నుంచి నామినేషన్లు దాఖలు చేయడానికి అవకాశం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్సీ స్థానానికి పోటీ పడుతున్న అభ్యర్థులు ఎన్నికల ప్రచార ఏర్పాట్లలో నిమిగ్నమై ఉండడం, వరుసగా సెలవులు రావడంతో నామినేషన్ల దాఖలు గడువుకు ఒక్కరోజు ముందు దాదాపుగా ఆశావహ అభ్యర్థుల ందరూ నామినేషన్లు వేయడానికి రంగం సిద్ధం చేసుకు న్నట్లు సమాచారం. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేయడంతో ఎన్నికల అంకంలో మొదటి అడుగు పడినట్లు అవుతుంది. ఇక్కడి నుంచి ఎన్నికల ప్రచారం ఊపందుకునే అవకాశం ఉంది. ముమ్మరంగా ఎన్నికల ప్రచారాలు చేయడం, ప్రత్యర్థులపై పైచేయి సాధించి, ఎన్నికల్లో గెలుపొందడానికి వ్యూహప్రతివ్యూహాలకు పదునుపెట్టడం మొదలుకుని ప్రలోభాలకు గురిచేయడం వంటి ప్రయత్నాలు జోరందుకునే అవకాశాలు ఉన్నాయని చెప్పవచ్చు. ఇప్పటికే అధికార పార్టీ అభ్యర్థి బాక్సులను పంపిణీ చేస్తున్నారనే వార్తలతో కేసులు నమోదు కావడం రాయలసీమ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని అధికారుల దరూ ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పక పాటించాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) నిబంధనలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన రోజు నుంచి జిల్లాలో కోడ్ అమలులో ఉందని ప్రభుత్వ కార్యాలయాలలో బ్యానర్లు, ప్లాస్టిక్ ఫ్లెక్సీలు ఓటర్లను ప్రభావితం చేసే ఎటువంటి పోస్టర్లు ఉండకూడదన్నారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో సాగేందుకు కమిషన్ జారీ చేసిన నిబంధనలను, సూచనలను తప్పక పాటించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకొని పనిచేయాలన్నారు. మార్చి 13న నిర్వహించబోయే ఎన్నికల కోసం జిల్లాలోని పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు ఉండేటట్టు చూడాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ కు పోలింగ్ నెంబరు తప్పక రాయాలన్నారు. బ్యాలెట్ బాక్సులు అవసరం మేరకు సిద్ధంగా ఉంచుకుని పోలింగ్ మెటీరియల్ సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వివిధ పార్టీల అభ్యర్థులు కుల, మత, ప్రాంతీయ పరమైన విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తించకూడదన్నారు. రాజకీయ ప్రకటనల ద్వారా కుల, మతపరమైన అభ్యర్థనలు చేయకూడదన్నారు. మసీదులు, చర్చిలు, ఆలయాలు, ఇతర ప్రార్థన స్థలాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదన్నారు. పోలింగ్ స్టేషన్‌కు ఓటర్లను తీసుకురావడం, తిరిగి తీసుకువెళ్లడం వంటివి నిషిద్ధమన్నారు. అనుమతి లేకుండా బ్యానర్లు కట్టడం, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించడం వంటివి చేయరాదని తెలిపారు. జిల్లాలోని అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించి అన్నమయ్య జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆంఒ సత్యనారాయణ, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

వాల్మీకుల స్థితిగతులను పరిశీలించాం

ఏకసభ్య కమిషన్ సభ్యులు శ్యాముల్ ఆనంద్‌కుమార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వాల్మీకుల ఎస్‌టి జాబితా పునరుద్ధరణ కోసం స్థితిగతులను పరిశీలించామని, నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తానని ఏకసభ్య కమిషన్ సభ్యులు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శ్యాముల్ ఆనంద్‌కుమార్ అన్నారు. వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ సభ్యులు మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వాల్మీకి సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతంలోని వాల్మీకుల వివరాలు, వారి జీవన విధానం, స్థితిగతులు, పూర్వం నుంచి అనాదిగా వస్తున్న ఆచారాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సర్వే ఫార్మాట్లో వివరాలు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామని తెలిపారు. ఇప్పటికే 5 జిల్లాలో పర్యటించానన్నారు. మిగిలిన జిల్లాలో పర్యాటించి ఏప్రిల్‌లో ప్రభుత్వానికి పూర్తి నివేదికను అందజేస్తామని పేర్కొన్నారు. అనంతరం వాల్మీకి సంఘం, జెఎసి నాయకులు శ్యాముల్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వాల్మీకుల ఎస్‌టి పునరుద్ధరణ కోసం ఏకసభ్య కమిటీని నియమించినందుకుగాను, కమిషన్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుండి బాధ్యతాయుతంగా నివేదిక ఇవ్వడానికి కృషిచేస్తున్న హర్షం వ్యక్తం చేశారు. శామ్యూల్ గతంలో ఇచ్చిన కమిషన్ నివేదికలను పరిగణలోకి తీసుకొని, తమకు ఇచ్చిన బాధ్యతను త్వరితగతిన పూర్తి చేసి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అనుకూలంగా నివేదిక ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ నాయకులు మా సహనాన్ని చేతగాని తనంగా భావించడం ఇప్పటికైనా మాని తమ న్యాయమైన డిమాండ్ వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ చర్యలను వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ మురళి, ఎపి వాల్మీకి సంఘం నాయకులు పులి శ్రీనివాసులు, సద్దల జయసింహ, బి.శ్రీనివాసులు, మహేష్, జగదీష్, భాస్కర్, కొత్తపుడుం శంకర, వలసల మంజు, మునగమానురెడ్డి శేఖర్, పిల్లి చంద్రన్న, శ్యామలమ్మ, బొంత సోమశేఖర్ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మండలానికి చెందిన వాల్మీకి సంఘం నాయకులు నక్కా మహేష్ కుమార్, ఎపి విబిఎస్ గౌరవ సలహాదారులు తిమ్మయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్ జగదీష్ మదనపల్లెలో ఏకసభ్య కమిషన్ సభ్యులు శ్యాముల్‌కు వినతిపత్రం సమర్పించారు.

మాట్లాడుతున్న శామ్యూల్ ఆనంద్ కుమార్

గల్ఫ్ బాధితులకు హెల్ప్‌లైన్ ఏర్పాటు : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జీవన ఉపాధి కోసం వివిధ దేశాలకు అన్నమయ్య జిల్లా నుంచి వెళుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గల్ఫ్ దేశాలలో ఉంటూ ఇబ్బందులు పడుతూ ఉండడాన్ని గమనించిన అన్నమయ్య జిల్లా పోలీసులు వారి సహాయం కోసం హెల్ప్ లైన్ నెంబర్ 8688830014 ఏర్పాటు చేశారు. మంగళవారం మీడియా సమావేశంలో ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ జిల్లాలో ఏటా కొన్ని వేల మంది ఉద్యోగ ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారని, అక్కడ వెళ్లిన వారు ఇబ్బందులు గురవుతుండడం తరచూ చూస్తున్నామని చెప్పారు. అక్కడ వెళ్లిన తర్వాత ఒక పని వీసాతో వెళ్తే ఇంకొక పని చేయించడం, మహిళలు ఇబ్బందులకు గురవడం జరుగుతుందని, అక్కడ ఇబ్బందులు గురవుతున్న వారి బంధువులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏజెంట్లపై ఫిర్యాదు చేస్తున్నారని చెప్పారు. పోలీసులు చర్యలు తీసుకొని ఇబ్బందులు గురవుతున్న వారిని స్వదేశానికి తీసుకొస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు చాలా సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. గల్ఫ్ వీసా విషయంలో అన్నమయ్య జిల్లా వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీన్ని దృష్టిలో ఉంచుకొని గల్ఫ్ ఏజెంట్లతో సమావేశం ఏర్పాటు చేసి బాధితులపై వివరాలు సేకరించి సమస్య పరిష్కారం కోసం అవగాహన కల్పించాలని హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్లాలనుకునేవారు హెల్ప్ లైన్ నెంబర్‌కు ఫోన్ చేసి వారి వివరాలను నమోదు చేసి ఏజెంట్ పూర్తి వివరాలు సేకరించి అనంతరం చర్యలు తీసుకోవడం తీసుకుంటామన్నారు. అన్నమయ్య జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : 'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎన్‌విఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో రాజంపేట మున్సిపాలిటీకి సంబంధించిన మున్సిపల్ కౌన్సిలర్ల, సచివాలయ కన్వీనర్ల, వాలంటీర్ల, గృహ సారథుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రతిపక్షాలకు బుద్ధి వచ్చేలా పనిచేయాలన్నారు. అర్హులైన వారికి న్యాయం చేయాలని, ఎవ్వరూ భయపడనవసరం లేదన్నారు. రాబోయే కాలంలో ప్రజలకు మరింత సేవ చేసేందుకు ఉపయోగపడే సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, ఎన్నికల పరిశీలకులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

దిశా యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దిశా యాప్, సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాలు గురించి ప్రజల్లో పూర్తిగా అవగాహన కల్పించాలని డిఎస్‌పి కె.కేశప్ప తెలిపారు. మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మహిళా సంరక్షణ పోలీసులు సమీక్షా సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. సైబర్ క్రైమ్, రహదారి ప్రమాదాల గురించి ప్రతి ఒక్క మహిళా పోలీస్ ప్రజల్లోకి వెళ్లి వారిని చైతన్య పరచాలని సూచించారు. మహిళలు ఎక్కడైనా సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిస్తే వెంటనే వాటిని పరిష్కరించే దశగా చూడాలని పేర్కొన్నారు. రానున్న వేసవికాలం దృష్ట్యా లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు. సమావేశంలో మదనపల్లి వన్‌టౌన్ ఎస్ఐ హరిహర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పివిసి ప్రభుత్వ పాఠశాలకు జాతీయ హరిత అవార్డు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల జాతీయ హరిత పాఠశాల అవార్డుకు కైవసం చేసుకొంది. మంగళవారం ఎపి నేషనల్ గ్రీన్ కోర్, సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని ఇండియన్ హ్యాబిటట్ సెంటర్‌లో జరిగిన హరిత పాఠశాలల కార్యక్రమంలో జాతీయ ఉత్తమ హరిత పాఠశాల అవార్డును ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ సునీత నరైన్ చేతులమీదుగా వాల్మీకిపురం పివిసి ప్రభుత్వ పాఠశాల గ్రీన్ టీచర్ రవీంద్ర రెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీసీ డైరెక్టర్ స్రవంతి, రాష్ట్ర కో-ఆర్డినేటర్ నీలకంఠయ్య, జిల్లా కోఆర్డినేటర్ చక్రధర్ రాజులు స్థానిక పాఠశాల హెచ్‌ఎం అమరనాథ రెడ్డి, గ్రీన్ టీచర్ రవీంద్రరెడ్డిలను అభినందించారు.

అవార్డును అందుకుంటున్న రవీంద్రరెడ్డి

రాష్ట్రంలో అరాచక పాలన : 'మండిపల్లి'

రాయచోటి : రాష్ట్రంలో వైసిపి అరాచక, దుశ్శాసన పాలన కొనసాగుతోందని, టిడిపి నియోజకవర్గ నాయకులు మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్వహిస్తున్న లోకేష్ పాదయాత్రతో టిడిపికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని వైసిపి అరాచకాలను సృష్టిస్తూ టిడిపి నాయకులు కార్యకర్తలు పై దాడులు చేస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని చెప్పారు. వైసిపి శక్తులు టిడిపి కార్యాలయం దాడులకు పాల్పడి, పట్టాభి వాహనాన్ని తగలబెట్టడం దారుణమని వాపోయారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు.. ఇంత జరుగుతున్నా శాంతిభద్రతలను కాపాడి, రక్షణ కల్పించాల్సిన పోలీసులే ప్రేక్షక పాత్ర వహిస్తుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తక్షణమే పోలీసులు దీనిపైన స్పందించి దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి తీవ్రంగా శిక్షించాలని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పట్టాభి అదృశ్యమైన 24 గంటల తరువాత మీడియా హాజరు పరచిన పోలీసులను చూస్తే అనుమానం కలుగుతోందని పేర్కొన్నారు. ఇది ఇలాగే కొనసాగితే ప్రజలు ప్రభుత్వం పైన తిరగబడే పరిస్థితులు వస్తాయని, ప్రజలు కట్టే పన్నుల ద్వారా పోలీసులు జీతాలు తీసుకుంటూ ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. గన్నవరంలో టిడిపి కార్యాలయం, కార్యకర్తలపై జరిగిన దాడులను మేధావులు, ప్రజా సంఘాలు ఖండించాలని చెప్పారు. ఈ ఘటనపై గవర్నర్ వెంటనే స్పందించి, చర్యలు తీసుకుని రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాలని డిమాండ్ చేశారు.

26న ఉచిత మెగా వైద్య శిబిరం

రాజంపేట అర్బన్: తిరుపతి రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం, హైదరాబాద్ ఫెడరేషన్ ఆఫ్ క్షత్రియ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన మండలంలోని కొత్త బోయినపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ వైద్యులచే గుండె, కిడ్నీ, ఎముకలు, నరాలు, షుగర్, హైపర్ టెన్షన్, స్త్రీల వ్యాధులు మొదలగు అన్ని రకాల జబ్బులతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య సేవలు అందించనున్నామని పేర్కొన్నారు. ప్రముఖ డాక్టర్లు ఎస్.బాలరామరాజు, ఎస్.చక్రధర్, ఎస్.మహేష్, భాస్కర్‌రాజు, వెంకటరమణ, జయప్రకాష్, మారుతీ కృష్ణ, వంశీ, సురేంద్ర, రవి రాజు, ఎస్.బాలరాజు, గాయత్రి, రేఖ, శ్రీహరి నాయుడు వైద్య శిబిరంలో పాల్గొని సేవలందించనున్నారు.

'విద్యార్థినుల సంరక్షణ బాధ్యత ప్రిన్సిపాళ్లదే'

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థినుల సంరక్షణ బాధ్యత ప్రిన్సిపాళ్లపై ఉంటుందని, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులపైన కఠిన చర్యలుంటాయని కలెక్టర్ గిరీష తెలిపారు. జిల్లాలో రెసిడెన్షియల్ పాఠశాలల పనితీరుపై కలెక్టర్ జిల్లా ప్రత్యేక అధికారులు, ఏపీ మోడల్ స్కూల్స్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాలు, గిరిజన సంక్షేమ విద్యాసంస్థలు, మహాత్మా జ్యోతిభా పూలే రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన పాఠశాలల పనితీరును పర్యవేక్షించాలని ఆదేశించారు. కొంతమంది ఉపాధ్యాయుల వల్ల పాఠశాలల్లో జరుగుతున్న వేధింపులను విద్యార్థులతో మాట్లాడి తెలుసుకోవాలని ఆయన అన్నారు. హిమోగ్లోబిన్, ఇతర పరీక్షలు చేయించాలని వైద్యాధికారులను ఆదేశించారు. బాలికలతో మాట్లాడి వారి పట్ల అనుచితంగా ప్రవర్తించే ఉపాధ్యాయులను గుర్తించాలని సూచించారు. కొందరు ప్రత్యేక అధికారులు పాఠశాలలను క్షేత్ర స్థాయిలో సందర్శించిన సందర్భంగా పరిశీలించిన విషయాలను తనకు తెలియజేశారు. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్ల దుస్థితికి గల కారణాలపై సంబంధిత ప్రధానోపాధ్యాయులను ఆరా తీశారు. సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఒ సత్యానారాయణ, ఏపీ మోడల్ స్కూల్స్, తదితర రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కలెక్టర్ నియమించిన ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

వేధింపులు ఆపాలని తపాలా ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆచరణ సాధ్యంకాని లక్ష్యాలను విధిస్తూ ఉద్యోగులను మానసిక ఒత్తిడికి గురి చేయడంతో పాటు ఆర్థికంగా చితికిపోయేలా చేయడం వంటివి అధికారులు మానుకోవాలని అఖిలభారత తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో కడప తపాలా సూపరింటెండెంట్ కార్యాలయం ఎదురుగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ సెక్రటరీలు జి.వి.సుబ్బారెడ్డి, పిఎ సలాం మాట్లాడుతూ తక్షణమే లక్ష్యం విషయంలో ఉద్యోగులపై వేధింపులు మానుకోవాలని పేర్కొన్నారు. లేని పక్షంలో తదుపరి కార్యాచరణలో భాగంగా విజయవాడ సిపిఎంజి కార్యాలయం ఎదుట నిర్వహించే ఒక్క రోజు ధర్నా కార్యక్రమం చేపడతామని తెలిపారు. పెద్ద ఎత్తున పాల్గొంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇతర నాయకులు రమణయ్య, పాలకొండ్రాయుడు, మునాఫ్, వెంకట్, గోవిందు, మహబూబ్ బాషా, ప్రభాకర్ ఇతర సభ్యులు పాల్గొన్నారు. పెన్షనర్ అసోసియేషన్ కార్యదర్శి జయరాములు, కోశాధికారి సుబ్బరాయుడు మద్దతు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

జిల్లాలో ఇసుక కొరత రానీయొద్దు : గిరీష

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో ఇసుక కొరత లేకుండా చూడాలని కలెక్టర్ జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ గిరీష తన ఛాంబర్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులతో ఇసుక లభ్యత, వివిధ ఇసుక రీచ్‌లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డిమాండ్‌కు అనుగుణంగా ఎటువంటి కొరత లేకుండా ఇసుకను సరఫరా చేయాలని సూచించారు. మంగంపేట, పీలేరు, టంగటూరు తదితర ఇసుక రీచ్‌లలో సరిపడా ఇసుక అందుబాటులో ఉందని కమిటీ కలెక్టర్‌కు నివేదించింది. గంగాపురం ఇసుక రీచ్‌కు కలెక్టర్ అధ్యక్షతన కమిటీ ఆమోదం తెలిపింది. తవ్వీన, రవాణా చేసిన పరిమాణంపై కాలానుగుణ నివేదికను జెపి పవర్ వెంచర్స్ ప్రయివేట్ లిమిటెడ్ సమర్పించాలనే నిర్ణయాన్ని కమిటీ ఆమోదించింది. పింఛా జలాశయంలోని పూడికతీత పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. భూగర్భ జల శాఖ అధికారులు సమన్వయంతో రీసర్వేలు నిర్వహించి అనుకూలమైన చోట ఇసుక రీచ్‌లను గుర్తించాలన్నారు.
జువైనల్ హోంను తనిఖీ చేస్తున్న కమిషనర్

మహిళా క్రికెట్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - కడప

కడప జిల్లాలో మహిళా క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆంధ్ర క్రికెటర్ అసోసియేషన్ క్రికెట్ అకాడమీ కన్వీనర్ పి.సంజయ్ కుమార్ రెడ్డి, డిసిఒ ఎస్.ఖాజామైనుద్దీన్, సభ్యులు విష్ణు మోహన్ రావు, రెహమాన్ తెలిపారు. జిల్లాలో మహిళ క్రికెట్ అభివృద్ధిలో భాగంగా మంగళవారం గంగాభవాని స్కూల్ బాలికలకు స్థానిక వై.ఎస్. రాజారెడ్డి, ఎసిఎ స్టేడియంలో ప్రత్యేక క్రికెట్ శిక్షణ కార్యక్రమం జిల్లా క్రికెటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి బాలికలకు క్రికెట్‌లో మంచి శిక్షణ ఇచ్చి వారిని ఉన్నత స్థాయి క్రికెట్‌కు ఎదిగేలా తీర్చిదిద్దాలన్నదే తమ ధ్యేయమని తెలిపారు. ఇందులో భాగంగానే గంగాభవాని స్కూల్ బాలికలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రాబోవు రోజుల్లో ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ప్రతి పాఠశాలకు చెందిన బాలికలకు నిర్వహించి వారిని క్రికెట్లో రాణించే విధంగా తయారు చేస్తామన్నారు. మహిళలకు క్రికెట్‌లో ఎన్నో అవకాశాలున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా కోచ్ వై.హరీష, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ విజయలక్ష్మి, స్కూల్ బాలికలు పాల్గొన్నారు.

టెన్నిస్ టోర్నమెంట్ విజయవంతం

కడప అర్బన్: నగరంలోని ఆఫీసర్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 21 వరకు నిర్వహించిన సీనియర్ నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. మంగళవారం ఆఫీసర్స్ క్లబ్‌లో టోర్నమెంట్‌లో విజేతలకు ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ అసోసియేషన్ డైరెక్టర్ జీవా విలియమ్స్, కోశాధికారి డాక్టర్ ఎం.సి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దాతలు కందుల శివానందరెడ్డి సతీమణి కందుల రాజేశ్వరమ్మ, అరుణాచలం ఆస్పత్రి అధినేత డాక్టర్ అరుణ, విస్డమ్ పాఠశాల ఎమ్‌డి సుధీర్ రెడ్డి, డాక్టర్ జి.సాయి ప్రసాద్‌రెడ్డి, బిసి కార్పొరేషన్ ఇడి డాక్టర్ వి. బ్రహ్మయ్య, ఆఫీసర్స్ క్లబ్ కోశాధికారి జె.కె. వీరభద్రయ్య హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి జాతీయస్థాయిలో ఈ టోర్నమెంట్ నిర్వహించామన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి 35 నుంచి 75 ఏళ్ల వయస్సు కల వారు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. సహకరించిన దాతలకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు, అతిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా గంగమ్మ జాతర

- పట్టువస్త్రాలు సమర్పించిన కడప మేయర్
- గంగమ్మను దర్శించుకున్న డిప్యూటీ సిఎం, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాయలసీమలోనే అత్యంత వైభవంగా నిర్వహించే అనంతపురం గంగమ్మ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. జాతరను ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా, కడప మేయర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి తదితర నాయకులుతో కలసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సురేష్ బాబు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయానికి విచ్చేసిన నేతలకు కమిటీ చైర్మన్, సభ్యులు, ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పూజారులు నేతలకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అనంతపురం గంగమ్మ ఆలయ ఖ్యాతిని మరింత పెంపొందిస్తామని పేర్కొన్నారు. గంగమ్మ ఆలయ వెనుక భాగంలో రాజగోపురం, కోనేరు నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా, కడప మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అనంతపురం గంగమ్మ జాతర అత్యంత వైభవంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. జాతర విజయ వంతానికి కృషి చేస్తున్న ఆలయ కమిటీ, దాతలు, అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, స్థానిక గ్రామాల ప్రజలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సామాల నరసింహారెడ్డి, సర్పంచ్ వెంకటనారాయణరెడ్డి, ఆలయ ప్రత్యేక అధికారి రవీంద్ర రాజు వీరితో పాటు ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ మండాడి వెంకటేశ్వర్లు గంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కడప మేయర్ సురేష్‌బాబు, నాయకులు

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న డిఎస్‌పి

క్రమ శిక్షణతో చదవాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులు చిన్నతనం నుండి క్రమశిక్షణతో ఇష్టపడి కష్టపడి చదవడం వల్ల జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని డిఎస్‌పి కేశప్ప తెలిపారు. మంగళవారం మదనపల్లె జిఆర్‌టి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలు అనుగుణంగా వారి కష్టాన్ని గుర్తుంచుకొని ఉపాధ్యాయుల సూచనల మేరకు బాగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. ఎస్‌ఐ హరిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్ తేజస్విని, హెడ్ కానిస్టేబుల్ డి.జి.రామమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలో రైతులకు ప్రభుత్వం రాయితీ ద్వారా మంజూరు చేసిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను మంగళవారం ఎపిఎంఐపి రాష్ట్ర స్థాయి అధికారి టెక్నికల్ ఓఎస్‌డి వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. మండలంలోని కనగాని, కుదురుచీమనపల్లి, అరికెల గ్రామాలలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రాయితీ ద్వారా మంజూరు చేసిన రైతుల పొలాల్లో అమర్చిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ఆయనపరిశీలించారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కలిగే ఉపయోగాలను, ఎరువుల యాజమాన్యం చేయు విధానంపై రైతులకు సూచనలు ఇచ్చారు. ఎవరైనా కొత్తగా డ్రిప్ పరికరాలు ఏర్పాటు చేయాలనుకుంటే వెబ్‌ల్యాండ్ లో విస్తీర్ణం ఉన్న రైతులకు 90 శాతం రాయితీతో ఐదు నుంచి పది ఎకరాలు మధ్యలో ఉన్న రైతులకు 70 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలను 15 రోజుల లోపల మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సూక్ష్మ సేద్య అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, మదనపల్లి ఉద్యాన అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, ఎంఐడిసి హరినారాయణ, ఎంఐఐ కృష్ణ నాయక్, ఎంఎఓ ఉమాదేవి పాల్గొన్నారు.

సామాజిక తనిఖీల్లో రూ.36,373 రికవరీ : పీడీ

ప్రజాశక్తి-కలికిరి

మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీల్లో రూ.36,373లు రికవరీకి ఆదేశించినట్లు పీడీ రవికుమార్ తెలిపారు. ఏప్రిల్ ఒకటి 2021 -2022 మార్చి 31 ఆర్థిక సంవత్సరం వరకు మండలంలో జరిగిన 978 ఉపాధిహామీ పనులకుగాను రూ.7.8 కోట్ల ప్రభుత్వ వ్యయంతో ఉపాధి హామీ పనులు నిర్వహించి కూలీలకు ఉపాధి కల్పించామని తెలిపారు. అయితే ఉపాధి హామీ ప్లేన్లలో, మస్టర్లలో, లెక్కలలో తేడాలు జరిగిన రూ.36,373 లు సిబ్బంది నుంచి రికవరీకి ఆదేశించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గంగయ్య, డివిఒ ప్రకాష్, ఎపిడి మధుబాబు, ఎపిఒ సుజాత, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నవాబుపేటలో వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-కలకడ

గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఎర్రబల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జోహార్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని నవాబుపేట పంచాయతీలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలకు ఆదేశించారు. ప్రతి గర్భిణి స్త్రీ ప్రతివారి కలిసి వైద్యం సూచనల మేరకు వారం ముందే అడ్మిషన్ అవ్వాలని ఆదేశించారు. మాతృ శిశు మరణాలు జరగకుండా జాగ్రత్త వహించాలని తెలియజేశారు. 60 సంవత్సరములు పైబడిన వారందరికీ రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జయరామయ్య, సూపర్‌వైజర్ రెడ్డమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ జమీల్ భాష, గణాంకిక అధికారి రోజా, ఆరోగ్య కార్యకర్త శివప్రసాద్, హెల్త్ కనకమ్మ, ఫైలెట్ రమేష్, ఆశా కార్యకర్తలు అనంతలక్ష్మి, గౌసియా పాల్గొన్నారు.

ఎఐసిసి ప్రతినిధిగా తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా డాక్టర్ ఎన్.తులసిరెడ్డిని నియమిం చారు. దేశ వ్యాప్తంగా ఎఐసిసి సభ్యులు జాబితాను కాంగ్రెస్ కమిటీ విడుదల చేసింది. ఆ జాబితాలో ఆంధ్రప్రదేశ్ నుండి 45 మందిని ఎంపిక చేయగా వారిలో 20 మందిని కో-అప్షన్ సభ్యులుగా ఎఐసిసి ఎంపిక చేసింది. వీరిలో కడప జిల్లా నుండి పిసిసి మీడియా చైర్మన్‌గా ఉన్న డాక్టర్ తులసిరెడ్డి, కమలమ్మ, గుండ్లకుంట శ్రీరాములు ఎఐసిసి సభ్యులుగా ఎంపికయ్యారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE :: RLY KODUR.

O.S.No. 166/2022

State Bank of India, Bazar Branch, rep by Its Branch Manager, Rlykodur.

...Plaintiff

Vs

Kayala Srinivasulu, S/o Venkataiah, D.No.8/50-A-3, Sai Nagar, Rajampet Town and Mandal, Annamayya Dist.

...Defendent

వాది, మీ పైన బ్యాంక్ లోన్ గురించి పై కోర్టు నందు దావా దాఖలు చేసివున్నారు. ఇందు విషయమై మీకెలాంటి ఆక్షేపణలు వున్న యెడల తేది: 9.3.2023న ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు నందు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని హాజరై తెలుపుకొనగలరు. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

//By Order Of the Court//

R.C. SURESH BABU

Advocate,

Rly.Kodur.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE :: RLY KODUR.

O.S.No. 181/2022

Andhra Pragathi Grameena Bank, Mangampet, rep.by Its Branch Manager.

...Plaintiff

Vs

D6. Pathuri Hari Babu, S/o Penchalaiah, Mangalampalli H.W. Village, Botumeedipalli Post, Obulavaripalli Mandal, Annamayya (Dist).

...Defendent No.6

వాది, మీ పైన మరియు ఇంకొందరి పైన అగ్రికల్చర్ లోన్ గురించి పై కోర్టు నందు దావా దాఖలు చేసివున్నారు. ఇందు విషయమై మీకెలాంటి ఆక్షేపణలు వున్న యెడల తేది: 2.3.2023న ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని హాజరై తెలుపుకొనగలరు. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

//By Order Of the Court//

R.C. SURESH BABU

Advocate,

Rly.Kodur.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

పుల్లంపేట : మాతృభాషపై మమకారంతో 'అ' ఆకారంలో విద్యార్థులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తెలుగు భాషా సంరక్షణ సమితి, రాజంపేట శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని కాకతీయ విద్యాసంస్థల ఆవరణలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగు భాషా సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ, రాజంపేట సమితి అధ్యక్షులు బొట్ల రామచంద్రయ్య నాయుడుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ముందుగా తెలుగు భాష ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాతృభాష మనిషికి జీవనాడి వంటిదని, భాష నశించినప్పుడు మనిషి ఉనికికే పెద్ద ప్రమాదం వాటిల్లుతుందని పేర్కొన్నారు. కావున ప్రతి ఒక్కరూ మాతృభాషను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సమాజాన్ని ప్రభావితం చేయగలిగిన ప్రతి ఒక్క తెలుగు వాడు తెలుగు భాషను ప్రేమించి, అభిమానించి, ఆదరించినప్పుడే భాష మనగలుగుతుందని, లేదంటే కనుమరుగై పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ కవి అడపాల వెంకటరమణ, విశ్రాంత భాషోపాధ్యాయులు బి.వి.నారాయణరాజు, బాలికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని మల్లెల హైమావతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు జ్యోతిర్మయి, పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు చిన్న సుబ్బన్న, పాఠశాల వ్యవస్థాపకులు పోలా సాయి వైభవ్, ప్రధానోపాధ్యాయులు రమేష్, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు సిఎం చంద్రమౌళి పాల్గొన్నారు. **పుల్లంపేట :** "అక్షరాన్ని బ్రతికిద్దాం - అమ్మ భాషను రక్షించుకుందాం అనే నినాదంతో జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని మండల పరిధిలోని అనంతంపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు జయలక్ష్మమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అనంతపల్లి విద్యార్థులు " అ ఆకారంలో మరియు "అ ఆకృతిలో ఉండే సన్నివేశాలు సంవత్సరం విద్యార్థులను ఎంతగానో ఆకర్షించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరినాథ్, సుబ్బయ్య, శ్రీకాంత్, పద్మనాభయ్య, వెంకటేష్, ప్రసాద్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. **గాలివీడు :** స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ కుంచా లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఒ.నిర్మల, తెలుగు పండిట్ ప్రసాద్ రెడ్డి, భగీరథి లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. **వాల్మీకిపురం :** పుస్తకం పట్టకముందే అమ్మ ఒడే బడిగా నేర్పు మాతృభాష అని మనిషి ప్రపంచంలోని ఏ ప్రాంతంలో ఉన్నా మాతృభాషను మరిచిపోకూడదని మండల కో-ఆప్షన్ సభ్యులు మహబూబ్‌బాషా అన్నారు. స్థానిక ఉర్దూ అకాడమీ లైబ్రరీలో మాతృభాషా దినోత్సవాన్ని లైబ్రరీ సిబ్బంది జాహెద్, ఫైరోజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కాశ్మీర్ నుంచి కన్యకుమారి వరకు భారతదేశంలో అనేక రాష్ట్రాలలో అనేక ప్రాచీన భాషలు ఉన్నప్పటికీ ఉర్దూ కూడా ఒక ప్రాచీన భాష అని ఉర్దూ గొప్పతనాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అహ్మద్ ఖాన్, డాక్టర్ అల్లామా ఇక్బాల్, మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్, జవాద్ హుస్సేన్, అమీర్ హుస్సేన్, షాహిద్, సుఫియాన్, ఇమ్రాన్, మత పెద్దలు, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు. **పీలేరు:** పీలేరులో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని వైభవంగా జరుపుకున్నారు. స్థానిక వివేకానంద సిద్ధార్థ పాఠశాలలో ఆ పాఠశాల వ్యవస్థాపకుడు, తెలుగు భాషాభిమాని స్వర్గీయ వడ్డమూడి శ్రీనివాసులు నాయుడు జ్ఞాపకార్థం కరస్పాండెంట్ మాధవి, "తెలుగు భాషాసమితి" ఆధ్వర్యంలో తెలుగు భాషా సభా సమావేశాన్ని నిర్వహించారు. పద్యాలు, కవితలను విద్యార్థులకు వినిపించారు. తరువాత మురళీధర్ రాజు, అతిథులను సన్మానించారు. విద్యార్థులకు వివిధ తెలుగు పద్య, వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించి విజేతలకు తెలుగు భాషా సమితి అధ్యక్షులు మురళీధర్ రాజు, అతిథులు సినీరచయిత డిగ్రీకళాశాల అధ్యాపకులు బాలాంజనేయులు, సి.ఆర్.పి నాగరాజ చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివేకానంద సిద్ధార్థ పాఠశాల యజమానురాలు మాధవి, ప్రిన్సిపాల్ సురేష్, తెలుగు ఉపాధ్యాయులు ఎన్. చలపతి నాయుడు, బాబు, సురేంద్ర, శైలజ, మురళీ, ప్రేమ, సుమతీ, ఇతర ఉపాధ్యాయులు, తెలుగు భాషాభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండలం పరిధిలోని కొర్లకుంట పంచాయతీ చలంపాలెం గ్రామంలో ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 20 రోజులు నుండి జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కా సాయి వికాస్ రెడ్డి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. క్రికెట్ టోర్నమెంట్ లో ఫైనల్ లో గెలిచి విజేతలుగా నిలిచిన జట్టుకు మొదటి బహుమతి గా రూ.1.5లక్షలు ప్రైజ్ మనీ, ట్రోఫీ, రన్నర్స్‌గా నిలిచిన జట్టుకు రూ.50వేలు ప్రైజ్ మనీ చెక్ రూపంలో ముక్కా రుపానంద రెడ్డి ఫౌండేషన్ అధినేత, వైసిపి నాయకుడు ముక్కా రుపానంద రెడ్డి ఆధ్వర్యంలో ఆయన తనయుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు, యువత పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బత్తిన వేణుగోపాల్ రెడ్డి, తల్లెం చంద్ర మోహన్ రెడ్డి, డిఆర్‌సిసియు బోర్డు మెంబెర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, కౌలూరి సుబ్రహ్మణ్యం రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, గజ్జెల శ్రీనివాసుల రెడ్డి ముక్కవారిపల్లి సర్పంచ్ అరవ శ్రీధర్, సాలవ రమణరాజు, సుబ్బ నరసయ్య పాల్గొన్నారు.

విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ముక్కా సాయి వికాస్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పథకాలపై అవగాహన కోసమే గృహ సారధులు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలికిరి

పథకాలపై అవగాహన కోసమే గృహ సారధులను నియమించాలమని ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఆర్‌ఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలలో ప్రభుత్వం ప్రజలకు చేపట్టిన పథకాలపై అవగాహన కల్పించి, ఏ ఒక్క కుటుంబంలో కూడా లబ్ధి పొందని కుటుంబం ఉంటే ఆ పథకం ఆ కుటుంబానికి ఎందుకు వర్తించలేదో వివరించాలన్నారు. సమస్య పరిష్కారాల కోసం గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పార్టీ పటిష్టతకు, రాబోవు ఎన్నికల్లో గెలుపు తథ్యం అనే నినాదంతో ముందుకు పోవాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గృహస్సారథులను నియమించారని తెలిపారు. మాజీ మార్క్ ఫెడ్ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో మనం గెలుపును సాధించాలంటే గృహ సారథులు సచివాలయం కన్వీనర్లు పార్టీ పథకాలను బలోపేతం చేసి సైనికుల్లా పని చేస్తేనే గెలుపు తథ్యమని తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వము చేయనటువంటి పథకాలను సిఎం జగన్ చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫు మొహిద్దిన్, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్పిటిసి కాకర్ల పద్మజాలోకవర్ధన్, ఎస్‌సి సెల్ కార్యదర్శి వి.హరి, మైనార్టీ సీనియర్ నాయకుడు జుబేర్ అహ్మద్, సతీష్ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ రెడ్డప్ప, మైనార్టీ యువ నాయకులు వేంపల్లి ఫయాజ్, బావాజీ, సర్పంచులు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఓ సువర్ణావకాశం

ప్రజాశక్తి-నందలూరు

ఓపెన్ స్కూల్ సిస్టం పేరుతో పదవ తరగతి పాసై, వివిధ కారణాలతో ఇంటర్‌లో చేరని విద్యార్థులకు ప్రభుత్వం సువర్ణావకాశం కల్పించిందని నందలూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ కళాశాల లో ఎపిఒఎస్‌ఎస్‌లో విద్యార్థులు తమ పేరు నమోదు చేసుకొని ఉన్నత చదువులు చదువుకోవచ్చని అన్నారు. ఇంటర్‌లో చేరి మధ్యలో చదువు నిలిపివేసిన వారికి కూడా ఇదొక మంచి అవకావమని తెలిపారు. ఫిబ్రవరి 21-27 తేదీల మధ్య అడ్మిషన్ తీసుకోవాల్సి వుంటుందని తెలిపారు. మార్చి 1-7 తేదిల మధ్య ఫీజు చెల్లించాలని, ఏప్రిల్ 3 నుంచి నుంచి పరీక్షలు రాయాలని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంప్రదించి వివరాలు తెలుసుకోవాలన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో పొదుగువాపు వ్యాధి నివారణ

ప్రజాశక్తి-కలికిరి

రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే పశువులకు పొదుగు వాపు ను నివారించుకోవచ్చునని కెవికె పశువైద్య విభాగపు డాక్టరు నవీన తెలిపారు. పాడి రైతులను తీవ్ర నష్టాలకు గురి చేసే వ్యాధుల్లో పొదుపు వ్యాపి వ్యాధి ముఖ్యమైనదని, అధిక పాల దిగుబడి ఉన్న పశువుల్లో ఒత్తిడి, పోషకాల లోపం కారణంగా పొదుగువాపు వ్యాధి తరచుగా సంభవిస్తుందని అన్నారు. దీని వలన పాడి రైతుల వైద్య ఖర్చు భరించడమే కాకుండా పాల ద్వారా వచ్చే ఆదాయాన్ని కోల్పోతారని తెలిపారు. దీని నుంచి బయట పడాలంటే పొదుగువాపు వ్యాధి నిర్మూలనకు పాడి రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పొదుగు వాపు వ్యాధి నిర్మూలనలో పశువుల రోగ నిరోధక శక్తి, పొదుగు ఆరోగ్యం, పరిశుభ్రత, కీలకపాత్ర వహిస్తాయని అన్నారు. సరైన మేతతో పాటు పొదుగు పారిశుధ్యం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. పాడి ఆవు ఉన్న కొట్టాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని, పాలు పితికిన తర్వాత పాల ద్వారం తెరుచుకొని ఉండటం వలన సూక్ష్మజీవులు ప్రవేశించి పొదుగు వాపు వ్యాధిని కలుగజేస్తాయని చెప్పారు. ఆవును పాలు పిండిన వెంటనే కింద కూర్చోకుండా చూసుకోవాలని, పొదుగు కడగడానికి పరిశుభ్రమైన నీటిని వాడాలని, పాడి రైతులు పాలు పితికే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. పశువుకి పొదుగు వాపు వ్యాధి సోకినట్లయితే వెంటనే పశువైద్యున్ని సంప్రదించాలని, .ఆలస్యం చేస్తే పొదుగు వాపు వ్యాధి చికిత్స కఠినమయ్యే అవకాశం ఉంటుందని సూచించారు. పాడి రైతులు పై తెలిపిన సూచనలు పాటించినట్లయితే పొదుగువాపు వ్యాధి రాకుండా పాడిపశువులు రక్షించవచ్చునని తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలో అనంతంపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఇఒ రంగనాథయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ వర్క్ బుక్కుల గురించి ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థుల పుస్తకాల గురించి ఆరా తీశారు. అదేవిధంగా పాఠశాలలోని తరగతి గదులను, వంటశాలను, మరుగుదొడ్లను చుట్టుపక్కల పరిసరాల పరిశుభ్రత గురించి ఆరా తీశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మధ్యాహ్నం భోజనం ను తనిఖీ చేశారు. నాడు నేడు పనుల స్థితిగతుల గురించి అధ్యయనం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అందించాలని తెలిపారు. బియ్యం, గుడ్లు తదితర వాటి గురించి ప్రధానోపాధ్యాయులును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించకుండా ఉండినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసి వంట చాలా బాగుంది అని వంట ఏజెన్సీలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో తనిఖీలు

ప్రజాశక్తి-నందలూరు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనీమియా ముక్తి భారత్ ప్రోగ్రాంని పరిశీలించుటకు రివైజ్డ్ చైల్డ్ హెల్త్ స్టేట్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ వారి వైద్య బృందం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను మంగళవారం తనిఖీ చేశారు. అనీమియా ముక్తి భారత్ ప్రోగ్రాంలో గర్భిణులకు, కౌమారదశ పిల్లలకు ఎఎన్‌ఎంలు చేసిన రక్త పరీక్షలను మరల పరీక్ష చేశారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ ఎఎన్‌ఎం లకు రక్త పరీక్షలను చేయు విధానం పైన అవగాహన కల్పిస్తూ, రక్తహీనత ఉన్న వారిని ఎలా గుర్తించాలి, వారికి ఎటువంటి చికిత్సను అందించాలి అనే విషయాలను తెలియజేశారు. సిహెచ్‌ఒలకు ఉన్న పరిజ్ఞానాన్ని అడిగి తెలుసుకున్నారు. తమ బృందం కోడూరు,ముక్క వారి పల్లి, ఓబులవారిపల్లి,పుల్లంపేట ,వై కోట, తంబళ్ల పల్లి లతో పాటు స్థానిక పిహెచ్‌సిని సందర్శించినట్లు తెలిపారు. మండల వైద్యాధికారి సృజన మాట్లాడుతూ 16,251 మందికి పరీక్షలు చేయగా అందులో 31 మందికి రక్తహీనత ఉన్నట్లు , 693 మంది గర్భవతులకు పరీక్షలు చేయగా 24 మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించడం జరిగిందని, వారికి చికిత్స ఇవ్వగా అనీమియా సాధారణ స్థాయికి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, లక్ష్మయ్య, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచనలు అందజేస్తున్న రాష్ట్ర అధికారి విజయ్

విద్యార్థుల వర్క్ బుక్కులను పరిశీలిస్తున్న ఎంఇఒ రాజగోపాల్

విద్యే భవిష్యత్తుకు బంగారు బాట

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రాథమిక విద్యే భవిష్యత్తుకు బంగారు బాట వేస్తుందని ఎంఇఒ రాజగోపాల్ అన్నారు. మంగళవారం రాచవేటివారి పల్లి పంచాయతీ గుండ్లబురుజు లోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల వర్క్ బుక్కులను, పాఠశాలలోని పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనంలో నేర్చుకున్న విద్యే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుస్తుందని అన్నారు. క్రమశిక్షణతో విద్యను నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు బాగా చదువుతున్నారని, ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పాఠ్యాంశాలను బోధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి వారికి అదనంగా సమయాన్ని కేటాయించాలని తెలిపారు.

యువత ప్రతిభకు సదావకాశం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి రచయితల సంఘం ఉగాది 27వ వార్షికోత్సవం సందర్భంగా నవ యువత ప్రతిభకు సదావకాశం కల్పిస్తునట్లు, మదనపల్లె సాహితీ సమాఖ్య సంస్థ అధ్యక్షులు పి. ఖిజర్‌ఖాన్, అరసం అధ్యక్షులు పివి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, లింగాల యుగంధరాచారిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాదిని పురస్కరించుకొని ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రచన, గానం, నాట్యం, ఏకపాత్రాభినయంలో ప్రతిఒక్కరూ పాల్గొన్నవచ్చునని తెలిపారు.

మిట్స్ ప్రొఫెసర్ కుసుమకు డాక్టరేట్

ప్రజాశక్తి-కురబలకోట

డాక్టరేట్ పొందిన కుసుమ

మండల పరిధిలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎస్.కుసుమకు తమిళనాడు, వేలూరులో ఉన్న విట్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. సర్టెన్ ఇన్వెస్టిగేషన్స్ ఆన్ ఈసిజి బేస్డ్ కార్డియో వాస్క్యూలర్ డిసీస్ క్లాసిఫికేషన్ యూసింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ అను అంశంపై చేసిన పరిశోధనలకుగాను డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లుగా తెలిపారు. ఎస్.కుసుమను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, విభాగాధిపతి డాక్టర్ ఆర్.కల్పన, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

స్కిల్ హబ్ శిక్షణకు 27 మంది అర్హులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక శ్రీ టి ఎన్ వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటిఐలో ప్రభుత్వ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. పదవ తరగతి చదివిన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి ,ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ స్కిల్ హబ్ సెంటర్ల ద్వారా శిక్షణ మంగళవారంతో ముగిసిందని డిఎస్‌డిఒ హరికృష్ణన్ తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ ట్రేడ్ లో 27 మందికి మూడు నెలల పాటు ట్రైనర్లు శ్రీమన్నారాయణ రెడ్డి శిక్షణ ఇచ్చారు .శిక్షణ పూర్తి చేసిన 27 మందికి అర్హత పరీక్ష నిర్వహించగా అందరూ అర్హత సాధించినట్లు తెలిపారు. వారికి బుధవారం ఐటిఐలో జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చౌడయ్య,ఇంచార్జ్ ప్రిన్సిపల్ శేషారెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనదారునిపై కేసు నమోదు

ప్రజాశక్తి- కలకడ

రోడ్డు ప్రమాదంలో మహిళను గాయపరచిన ద్విచక్ర వాహనదారునిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ పోతువారిపల్లికు చెందిన నాగార్జున భార్య నాగరత్నమ్మ ఈనెల 19న దేవళంపేటలో జరిగిన శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి జాతరకు వెళ్లేందుకు నడుచుకుని వస్తుండగా, బాటవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఎపి03 సిఎఫ్ 1974 నెంబర్ నెంబర్ గల ద్విచక్ర వాహనంతో కెవి.పల్లి మండలం మహల్ రాజుపల్లికి చెందిన జయచంద్ర అతివేగంగా నడుపుతూ మహిళను ఢీకొనడంతో గాయపడినట్లు తెలిపారు. ఆమెను పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని అన్నారు. నాగరత్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్విచక్ర వాహన దారునిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తీవ్రంగా గాయపడిన వృద్ధుడు మృతి

హత్య కేసుగా నమోదు.. పరారీలో నిందితులు

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని బురకాయలకోట పంచాయతీ యర్రమాసి వారిపల్లెకు చెందిన వై.శంకర్నాయుడు(58)ను ఆదే గ్రామానికి చెందిన సమీప బంధువు వై.శ్రీనివాసులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన విషయం విధితమే. తీవ్రంగా గాయపడిన వై.శంకర్నాయుడు చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి తన నివాసంలో మృతిచెందాడు. సమాచారం అందుకున్న మదనపల్లి డిఎస్‌పి కేశప్ప, సిఐ సాదిక్ అలీ మంగళవారం మృతుడి నివాసం చేరుకొని విచారించారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడారు. నిందితుడు వై.శ్రీనివాసులు, మృతుడు వై.శంకర్ నాయుడు మధ్య గత కొన్నేళ్లుగా గతంలో నగదు లావాదేవిలు ఉండేవని చెప్పారు. ఈ క్రమంలో శ్రీనివాసులు భార్య వై.శంకర్ నాయుడుతో వివాహేతర సంబందం పెట్టుకుంది. విషయం తెలుసున్న శ్రీనివాసులు, కుమారుడు వెంకటేష్‌లు శంకర్‌నాయుడుతో గొడవ పడ్డారు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చితకబాదారు. నొప్పులతో పడివున్న శంకర్‌నాయుడును పక్కింటి వాళ్లు గమనించి భార్య ధనమ్మకు సమాచారం అందించారు. ధనమ్మ పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు విచారించి అప్పట్లో వై.శ్రీనివాసులు, కుమారుడు వై.వెంకటేష్ పైన కేసు నమోదు చేశారు. దెబ్బల నొప్పి తాళలేక రెండు రోజుల తర్వాత వై.శంకర్ నాయుడు మృతిచెందాడు. ఆర్థిక లావాదేవీలు, వివాహేతర సంబందంతోనే కొట్టి తన భర్తను హత్య చేసినట్లు భార్య ధనమ్మ ఫిర్యాదు చేసింది. ఇద్దరిపై హత్యకేసు నమోదు చేశామని, నింధితులు పరారీలో ఉన్నట్లు సిఐ సాదిక్ ఆలీ వెల్లడించారు. మదనపల్లి జిల్లా ఆస్పత్రిలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విచారణ చేపడుతున్న డిఎస్‌పి కేశప్ప, సిఐ సాదిక్ అలీ